సాక్షి అనకాపల్లి

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



పీఎం సభా ప్రాంగణం పరిశీలన

విశాఖ: ప్రధాని మోదీ సభ జరగనున్న ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానాన్ని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పరిశీలించారు.



ఘన సత్కారం

విశాఖ: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావును ఘనంగా సత్కరించారు.



చేనేత వస్త్రాలకు చిరునామా

విశాఖ: చేనేత అభివృద్ధి కమిషనర్, న్యూఢిల్లీ సౌజన్యంతో శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన ఆకట్టుకుంటోంది.

న్యూస్‌రీల్

నేడు గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష

తుమ్మపాల: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే గ్రూప్–2 స్క్రీనింగ్ టెస్ట్‌కు 10,627 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు జేసీ ఎం.జాహ్నవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం ప్రాంతాల్లో 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సెల్ ఫోన్లు, గాడ్జెట్స్, ఎటువంటి ఎలక్ట్రిక్ యంత్ర పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. అటువంటి పరికరాలను పరీక్ష కేంద్రం బయటే భద్రపరచుకోవాలన్నారు.

బాలల హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు



బాలల హక్కులపై మాట్లాడుతున్న అనంతలక్ష్మి

తుమ్మపాల: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె.అనంతలక్ష్మి అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలో ఓ ఫంక్షన్ హాలులో బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లకు ఆమె అవగాహన కల్పించారు. బాల్య వివాహలు ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దిశ ఎస్సై రాములమ్మ, బాలల సంక్షేమం ప్రొబేషన్ అధికారి శరత్‌బాబు మాట్లాడుతూ బాలల న్యాయ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల హక్కులను ఎక్కడైనా ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. బాలల హక్కుల సహాయానికి 9966141470 సంప్రదించాలని బాలల ప్రొబేషన్ అధికారి పి.లక్ష్మి తెలిపారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్లకు ఎసరు..!

- టీడీపీ తొలి జాబితాలో పార్టీ విధేయులకు మొండి చెయ్యి
- గంటా, పల్లా, బండారుకు దక్కని ప్రాధాన్యం
- పీలాకూ మొండి చెయ్యి.. దాడి కుటుంబానికి దెబ్బ
- కార్యకర్తలకు సైతం అందుబాటులోకి రాని సీనియర్లు
- గణబాబుకు సీటు కేటాయింపుపై 'పశ్చిమ'లో గరం గరం
- విశాఖ పార్లమెంటరీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ రాజీనామా



మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్‌కు టికెట్ దక్కకపోవడంతో అనకాపల్లిలో టీడీపీ శ్రేణుల ఆందోళన

సాక్షి, విశాఖపట్నం : నమ్మిన వారిని నట్టేట ముంచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మరోసారి నిరూపితమైంది. పార్టీని అంటిపెట్టుకొని.. భుజాలపై మోస్తున్న సీనియర్లను కరివేపాకులా తీసి పడేశారు. పొత్తులో భాగంగా జనసేనతో కలిసి తొలి విడత విడుదల చేసిన జాబితా.. సీనియర్లలో కుంపటి రాజేసింది. సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని మొదటి జాబితాలో తమ పేర్లు ఉంటాయని భావించిన వారంతా.. చంద్రబాబు కుతంత్ర రాజకీయాలకు బలయ్యారు. మొత్తం 94 మంది అభ్యర్థుల లిస్టులో తమ పేర్లు లేకపోవడంతో కంగుతిన్నారు. నిన్నా మొన్న పార్టీలోకి వచ్చిన వారికి సీట్లు కేటాయించడంపై సీనియర్లు అవాక్కయ్యారు.

అందరిదీ అదే పరిస్థితి..!

- ముందుగా ఊహించినట్లుగానే గంటా శ్రీనివాసరావును పొమ్మనలేక పొగపెట్టినట్లుగా చంద్రబాబు వ్యవహరించారు. సీటు మార్పు అంటూ ఊహాగానాలు వచ్చినా.. చివరికి ఆయన పేరు ప్రస్తావన లేకుండానే తొలి జాబితా సాగిపోయింది. గత ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి ఉభయ గోదావరి జిల్లాల వరకూ అన్నీ తానై వ్యవహరించిన గంటాకు మొండి చెయ్యి చూపించడంతో కేడర్ భగ్గుమంటోంది. జాబితా విడుదలైన తర్వాత గంటా ఇంట్లో ఒంటరిగా ఉండిపోయారు. ఒకరిద్దరు సన్నిహితులతో మాత్రమే మాట్లాడిన గంటా.. కేడర్, పార్టీ శ్రేణులు ఇంటికి వచ్చినా.. తర్వాత కలుద్దామని చెప్పి పంపించేశారు.
- విశాఖ టీడీపీకి పెద్ద దిక్కుగా వ్యవహరించిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తికీ తొలి జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆయన మొహం చాటేశారు. పెందుర్తి సీటు పొత్తులో భాగంగా జనసేనకు ఇస్తారని ముందుగానే ప్రచారం చేశారు. అయితే.. పెందుర్తి సీటు కచ్చితంగా తనకు గానీ, కుమారుడికి గానీ ఇవ్వాలని ఇటీవల పర్యటించిన చంద్రబాబు, లోకేష్ ఇద్దరికీ బండారు విజ్ఞప్తి చేశారు. కానీ.. ఈ సీనియర్‌ని కూడా పక్కన పెట్టేలా వ్యవహరించడంతో.. కేడర్ మూగబోయింది. ముఖ్యనేతలతో సమావేశమైన బండారు.. మరోసారి అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- విశాఖ పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుదీ అదే పరిస్థితి. 2019 ఎన్నికల్లో పల్లాని చంద్రబాబు పోటీలో నిలబెట్టినా.. గాజువాక నుంచి పవన్ పోటీ చేస్తున్నందున ప్రచారం కూడా చెయ్యొద్దంటూ హుకుం జారీ చేశారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేసిన చంద్రబాబు.. గాజువాక రాకపోయినా పట్టించుకోని పల్లా.. పార్టీని కాపాడుకునేందుకు నాలుగున్నరేళ్లుగా కష్టపడుతున్నారు. అయినా.. పల్లాకు సీటు గ్యారెంటీ లేదని అధిష్టానం చెప్పకనే చెప్పింది. మరోసారి అధిష్టానంతో మాట్లాడి.. సీటు ఉంటుందా.. లేదా అనేది క్లారిటీ వచ్చిన తర్వాత.. భవిష్యత్తు కార్యాచరణ ఏంటనేది నిర్ణయించుకుందామని తన అనుచరగణంతో పల్లా చెప్పినట్లు తెలుస్తోంది.
- పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కనీసం పట్టించుకోని గణబాబుకు మరోసారి పశ్చిమ సీటు కేటాయించడంపై పార్టీలో అసమ్మతి జ్వాలలు చెలరేగుతున్నాయి. గణబాబుకు ఈసారి టికెట్ ఇవ్వొద్దంటూ పార్టీ సీనియర్లు తిరుగుబావుటా ఎగరేసినా.. పట్టించుకోకుండా టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసేశారు. టీడీపీలో అడ్డగోలు రాజకీయాలు జరుగుతున్నాయంటూ సన్నిహితుల వద్ద వాపోయారు. ఏ పార్టీలో చేరు తాననేది త్వరలోనే చెబుతానని ప్రకటించారు.
- అనకాపల్లిలో పార్టీకి పునాదిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు కూడా చేదు అనుభవం ఎదురైంది. ఏడాదిన్నర క్రితం జరిగిన నియోజకవర్గ సమీక్షలోనూ పీలాకే టికెట్ అన్నట్లుగా చంద్రబాబు సంకేతాలిచ్చి.. చివరి నిమిషంలో జనసేన తరఫున కొణతాల రామకృష్ణకు టికెట్ కేటాయించడంపై ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితా ప్రకటించిన వెంటనే పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. అధిష్టానం పునరాలోచన చేయకుంటే తమ నాయకుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు.
- వలస పక్షుల్లా.. ఆ గూటికీ.. ఈ గూటికీ తిరుగుతూ ఉండే దాడి వీరభద్రరావు కుటుంబం.. నెల రోజుల క్రితం చంద్రబాబు హామీతో టీడీపీ పంచన చేరారు. బాబు చేసే మోసాల గురించి పూర్తిగా తెలిసినా.. దాడి ఫ్యామిలీ మరోసారి భంగపాటుకు గురైంది. తనకు గానీ.. కుమారుడు రత్నాకర్‌కు గానీ టికెట్ ఇస్తానని చెప్పి.. నమ్మించి గొంతు కోశారంటూ దాడి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వైరి వర్గంగా భావించే కొణతాలకు టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.
- నమ్మక ద్రోహానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అంటూ టీడీపీ సీనియర్ నాయకులు అనుచర వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. బాబు కొట్టిన దెబ్బకు భవిష్యత్తు కార్యాచరణపై సీనియర్లంతా సమాలోచనలు చేస్తున్నారు.

జనసైన్యం.. నైరాశ్యం!

- కొణతాలకు అనకాపల్లి సీటు ప్రకటనతో రేగిన చిచ్చు
- తొలి జాబితాపై రగిలిపోతున్న సీనియర్లు, ఆశావహులు
- వ్రతం చెడినా ఫలితం లేదంటూ ఆవేదన
- అధ్యక్షుడు పవన్ తీరుపై తీవ్ర అసంతృప్తి
- చంద్రబాబుకు సరెండరయ్యారంటూ నిప్పులు
- పార్టీ కార్యాలయాల వైపు కన్నెత్తి చూడని నేతలు



సాక్షి, విశాఖపట్నం: ఎన్నో రోజుల నుంచి ఊరిస్తున్న టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా జనసైన్యాన్ని తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేసింది. ఒకపక్క పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న వారికి కాదని నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ప్రకటించడం, మరోపక్క పొత్తులో కేవలం 24 స్థానాలే జనసేనకు కేటాయించడం వీరిలో తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. చంద్రబాబు కోసం తమను బలి పశువులను చేశారంటూ వీరు లోలోన రగిలిపోతున్నారు. పరుచూరి భాస్కరరావు ఆరేళ్ల నుంచి అనకాపల్లి సీటును ఆశిస్తూ అక్కడ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన భారీ మొత్తంలో చేతి చమురు వదిలించుకున్నారు. ఇటీవల నాగబాబు అనకాపల్లిలో నిర్వహించిన సభకు, కశింకోట మండలం విస్సన్నపేట భూముల కేటాయింపు వ్యవహారాల్లో ఆందోళనకు అవసరమైన సొమ్మును ఆయనతోనే ఖర్చు పెట్టించారని చెబుతున్నారు. దీంతో అనకాపల్లి జనసేన అభ్యర్థి ఆయనేనన్న భావన అందరిలోనూ నెలకొంది. ఇంతలో కొద్ది రోజుల క్రితం పార్టీలో చేరిన కొణతాలకు అకస్మాత్తుగా సీటు కేటాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలా తనను ఆర్థికంగా వాడుకుని అన్యాయం చేశారని అనుచరుల వద్ద చెప్పుకుని కన్నీటి పర్యంతమవుతున్నట్టు తెలిసింది.

అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి..

పెందుర్తి స్థానాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆశిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అరకొర సీట్ల పొత్తుతో తమకు దక్కవన్న భయం వీరిని వెంటాడుతోంది. అలాగే ఇటీవలే వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్సీ వంశీకృష్ణదీ అదే పరిస్థితి. ఆయన ఇన్నాళ్లూ భీమిలి లేదా విశాఖ దక్షిణ సీటును ఆశిస్తున్నారు. తాజా స్థితితో తానూ ఆశలు వదులుకోవల్సి ఉంటుందేమోనన్న ఆందోళనతో ఉన్నారు. ఇక పవన్ 24 సీట్లకే అంగీకరించడాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ కూడా తప్పుబడుతున్నారు. ఇన్నాళ్లూ ఉమ్మడి విశాఖ జిల్లాలో కనీసం నాలుగైదు స్థానాలైనా జనసేనకు కేటాయిస్తారని భావించారు. కానీ పొత్తులో 24 సీట్లే ఇవ్వడం, అందులో ఒకటి కొణతాలకు కేటాయించడంతో రెండో జాబితాలో మరొకరికి మించి ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. అలా ఇచ్చినా గాజువాక లేదా యలమంచిలి స్థానాలను పవన్ సోదరుడు నాగబాబుతో అంటకాగుతున్న సుందరపు బ్రదర్స్‌లో ఒకరికి ఇస్తారు తప్ప పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన వారికి దక్కదని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ఆ నేతల్లో అంతర్మథనం

టికెట్లను ఆశించి ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన నాయకులు ఇప్పుడు ప్రస్తుత పరిస్థితిని చూసి తాము తప్పు చేశామా? అని అనుయాయుల వద్ద అంతర్మథనం చెందుతున్నారు. వ్రతం చెడినా ఫలితం దక్కలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర పొత్తుపై జనసేన శ్రేణులు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని సోషల్ మీడియా ద్వారా వెళ్లగక్కుతున్నారు. చంద్రబాబు కోసం సీట్ల త్యాగాలు చేసి తమను బలి పశువులను చేశాడని, ఈ కొద్దిపాటి స్థానాలకే చంద్రబాబుకు సరెండర్ అయ్యారని నిప్పులు చెరుగుతున్నారు. తీవ్ర నైరాశ్యం, అసంతృప్తితో వీరు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. జనసేన కార్యాలయాల వైపు కన్నెత్తి చూడడం లేదు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎయిర్‌పోర్టు నుంచి ఎండాడలోని కార్యాలయం వరకు భారీ ర్యాలీ

గోపాలపట్నం/కొమ్మాది: రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై.. శనివారం విశాఖ వచ్చిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి విమానాశ్రయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన్ని గజమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ముంచెత్తారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కంబాల జోగులు, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజు, విశాఖ ఉత్తర, పశ్చిమ సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్ నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు, తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులు వై.వి.సుబ్బారెడ్డికి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి బయటకు వస్తుండగా.. అభిమానులు ఆయన్ని భుజాలపై ఎత్తుకుని ప్రచార రథం వరకు తీసుకొచ్చారు. వందలాది కార్లతో ఓపెన్ టాప్‌లో భారీ ర్యాలీగా బయలుదేరిన ఆయనకు.. కె.కె.రాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్ గజమాలతో సత్కరించి, పూలవర్షం కురిపించారు. అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, వార్డు అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బానాల తరుణ్ కుమార్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరించారు. అక్కడ నుంచి అభిమానులకు అభివాదం చేసుకుంటూ ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. అక్కడ కార్యాలయ పర్యవేక్షకుడు జి.రవిరెడ్డి వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సుబ్బారెడ్డి రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్, కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు బెహరా భాస్కరరావు, శ్రీవత్సవ్, పేడాడ రమణకుమారి, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్‌లు, జిల్లా, రాష్ట్ర అనుబంధ విభాగాల ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భక్త జన తరంగాలు

- తీర ప్రాంతాల్లో మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలు
- సముద్రుడికి పూజలు చేసిన లక్షలాదిమంది భక్తులు





పూడిమడక తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) తీరంలో స్నానాలకు ముందు బ్రహ్మముడులు వేసుకుని సముద్రునికి పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం/అచ్యుతాపురం/రాంబిల్లి: మాఘ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రధాన తీర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. పూడిమడక, రేవుపోలవరం, వాడపాలెం తదితర సముద్ర తీరాల్లో లక్షలాదిమంది భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించారు. సముద్రుడికి పూజలు నిర్వహించారు. నూతన వధూవరులు, దంపతులు బ్రహ్మముడులు వేయించుకుని పుణ్యస్నానాలు చేశారు. కుటుంబంలో అకాల మరణం చెందినవారికి తర్పణాలు వదిలారు. రేవుపోలవరం తీరంలో వెలసిన శ్రీ లక్ష్మీమాధవస్వామిని దర్శించుకున్నారు. సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చినట్టు అధికారుల అంచనా. నర్సీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపి భక్తులను సురక్షితంగా తరలించారు.

తీరానికి తరలివచ్చిన భక్తులకు సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సత్యసాయి సేవా సంస్థలు, పలు యువజన సంఘాలు పోటీపడ్డాయి. నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నక్కపల్లి సీఐ అప్పన్న బందోబస్తు నిర్వహించారు. రాంబిల్లి శివారు వాడపాలెం తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడికి నమస్కరించారు. గంగాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాఘ పౌర్ణమి జాతరలో భాగంగా పూడిమడక తీరంలో తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా పోటెత్తారు.

సముద్ర తీరాన ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జగన్నాథ స్వామిని కొలిచారు. పోలీసులు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనకాపల్లి నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపారు.



వాడపాలెం బీచ్‌లో భక్తుల పుణ్యస్నానాలు



పూడిమడక తీరానికి పోటెత్తిన భక్తులు

నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా జీఆర్ఆర్ మోహన్

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా జి.ఆర్.ఆర్.మోహన్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఇక్కడ నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న బి.వెంకట్రామయ్యను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు శనివారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

జీసీసీలో 41 మందికి పదోన్నతులు

మహారాణిపేట: గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో 20 నుంచి 30 ఏళ్లకు పైబడి సేల్స్‌మన్ క్యాడర్‌లో పని చేస్తున్న 41 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతలు కల్పించి, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. జీసీసీ ప్రధాన కార్యాలయంలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. పదోన్నతలు పొందిన 41 మందిలో 39 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు ఉన్నారు. తమ అర్హతలు, సేవలు గుర్తించి పదోన్నతలు కల్పించినందుకుగానూ జీసీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ మేనేజర్(పరిపాలన) జె.యూస్టస్, డివిజనల్ మేనేజర్(రంపచోడవరం) జి.పార్వతీశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేస్తున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ వైస్ చైర్మన్, ఎండీ సురేష్ కుమార్

క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ భానుమతి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామివారి అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

విమ్స్‌లో క్యాన్సర్ విభాగం ప్రారంభం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగులకు మెరుగైన సేవలందించడానికి త్వరలో కొత్త విభాగాలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు వెల్లడించారు. విమ్స్‌లో మెడికల్ అంకాలజీ, బ్రెయిన్ స్ట్రోక్ విభాగాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ విమ్స్ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. విమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కోవిడ్ అనంతరం అన్ని సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఇక్కడ అందిస్తున్న సేవలు, జరుగుతున్న శస్త్రచికిత్సల వల్ల రోజుకు ఓపీ 700 దాటుతోందన్నారు. 70 నుంచి 80 మధ్యలో ఉండే ఇన్‌పేషెంట్ల సంఖ్య సుమారు 200కు చేరిందన్నారు. శనివారం నుంచి అంకాలజీ సర్జికల్ థెరఫీ, బ్రెయిన్ స్ట్రోక్ వైద్యానికి సంబంధించిన సేవలు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. రెండు మూడో రోజుల్లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, బర్న్స్ వార్డులు అందుబాటులోకి వస్తాయన్నారు. సూపర్ స్పెషాలిటీ సేవల్లో గైనిక్ విభాగం లేకపోవడంతో.. ఇక్కడ అందుబాటులో ఉంచలేకపోయినట్లు తెలిపారు.

Government of Andhra Pradesh, Endowments Department
E-PROCUREMENT TENDER NOTICE
Re construction of **Sri Suryanarayana Swamy Temple, Sukuruputtu, Gonduru (V), Paderu (M), A.S.R. Dist. NIT NO.P/COE/24/2024-30, Dt. 17.01.2024.** For further details log onto website "https://tender.apeprocurement.gov.in" For further details contact Ph. 6303112663.
EXECUTIVE AUTHORITY, Sri Suryanarayana Swamy Temple, Sukuruputtu, Gonduru (V), Paderu (M), A.S.R. Dist.

ప్రత్యామ్నాయ పంటలు, పాడి అభివృద్ధిపై దృష్టి

- కలెక్టర్ రవి పట్టన్ శెట్టి


చిరుధాన్యాల పంటలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, చిక్కాల రామారావు

తుమ్మపాల: ప్రత్యామ్నాయ పంటల సాగు, పాడి అభివృద్ధిపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు దృష్టి సారించి, రైతులకు తగిన సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఇప్పటివరకు 55 శాతం నగదు చెల్లించినట్టు చెప్పారు. మిగిలిన మొత్తాన్ని త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మామిడి, జీడిమామిడి పంటలకు అధిక దిగుబడి వచ్చేందుకు అవసరమైన సాగు పద్ధతులను రైతులకు తెలియజేయాలని సూచించారు. నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలను గుర్తించడం పట్ల అవగాహన కలిగించాలని చెప్పారు. బ్యాంకుల ద్వారా రైతులకు తగిన రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ తృణధాన్యాలు ఎక్కువగా సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియజేయాలన్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం 'చిరు ధాన్యాలతో వంద రకాల వంటలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ప్రసాదరావు, ఏపీఎంఐపీ అధికారి జి.వి.లక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీడీ జి.డైజీ, శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఈఈ ఎ.త్రినాథం, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్ రాజశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆర్.గంగునాయుడు, ఆడారి సూరిఅప్పారావు పాల్గొన్నారు.

వై జంక్షన్‌లో ఢీకొన్న నాలుగు వాహనాలు


ప్రమాద ఘటనలో నుజ్జు అయిన వాహనాలు


గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

- ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాయకరావుపేట: స్థానిక వై.జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, నాలుగు వాహనాలు నుజ్జయ్యాయి. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రోడ్డులో వై.జంక్షన్ సిగ్నల్ వద్ద వెళుతున్న బస్సును వెనుక నుంచి ఓ లారీ ఢీకొని దూసుకుపోయింది. అదే లారీ ముందున్న కారును ఢీకొనడంతో ఆ వాహనం ముందున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో లంకేశ్వరరావుకు తీవ్రంగా, ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కాకినాడ జిల్లా తుని ఏరియా ఆస్పత్రి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేని ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. క్షతగాత్రులు చికిత్స అనంతరం విశాఖ వెళ్లిపోయినట్టు తెలిసిందన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నాతవరం: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలో నర్సీపట్నం, తుని మధ్య తాండవ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా 10 కిలోల గంజాయితో ఆటోలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు చెప్పారు. కేరళ రాష్ట్రానికి చెందిన కె.శివన్, పి.డి.మోహన్‌దాస్‌లపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ టీములకు శిక్షణ

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికలు–2024 ఏర్పాట్లలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ బృందాలకు కలెక్టరేట్‌లో శనివారం శిక్షణ నిర్వహించారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, డిప్యూటీ తహసీల్దార్లకు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ టీములకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, డీపీఆర్సీ నాగలక్ష్మి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ గోవిందరావు, డ్వామా పీడీ సందీప్ ఎన్నికల నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. ఎస్‌బీ సీఐ అప్పలనాయుడు, ఎలక్షన్ సెల్ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు పాల్గొన్నారు.

తాండవ మెయిన్ గేట్ల మరమ్మతులకు టెండర్లు

- ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు


తాండవ మెయిన్ గేట్లు పరిశీలిస్తున్న ఈఈ స్వామినాయుడు, డీఈ అనురాధ

నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల మరమ్మతులకు టెండర్లు పిలిచినట్టు ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు తెలిపారు. డీఈ అనురాధతో కలిసి ఆయన శనివారం రిజర్వాయర్‌ను సందర్శించారు. మెయిన్ గేట్ల వద్ద లీకేజీలను పరిశీలించి, ఏవిధంగా మరమ్మతులు చేయించాలో తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ, డీఈ అనురాధకు సూచించారు. శిథిలమైన చమ్మచింత నదిపై నిర్మించిన అక్విడెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్లకు మరమ్మతులు, పంట కాలువలో పూడిక తీసేందుకు టెండర్లు పిలిచామన్నారు. మార్చి నెలాఖరు నుంచి పూడికతీత పనులు చేపట్టనున్నట్టు చెప్పారు.


తాండవ నదిపై నిర్మించిన అక్విడెక్టును పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారులు

వైభవంగా గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) బ్రహ్మలింగేశ్వరస్వామి

- శివ నామస్మరణతో మార్మోగిన త్రిశూల పర్వతప్రాంతం
- ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్ దంపతులు


గిరిప్రదక్షిణలో స్వామి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: త్రిశూల పర్వత శ్రేణులు శివనామ స్మరణతో మార్మోగాయి.. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో నిర్వహించిన గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కళావతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ అనగానే సింహగిరి గుర్తుకు వస్తుందన్నారు. ఈ ఏడాది అదేస్థాయిలో బ్రహ్మలింగేశ్వరస్వామి కొలువైన త్రిశూల పర్వతం చుట్టూ ప్రదక్షిణ జరిగిందన్నారు. రాజరాజేశ్వరిదేవి, సమేత బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని చెప్పారు. ఏటా మహాశివరాత్రి, కార్తీకమాసంలో వేల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. భక్తుల కోరిక మేరకు గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశామన్నారు. ఇటువంటి దైవ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవచ్చన్నారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా స్వామి వారి పల్లకీని ఎమ్మెల్యే మోశారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి చిన్న, మాజీ కౌన్సిలర్ గవిరెడ్డి స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

2 కోట్ల ఉపాధి పని దినాలు కల్పిస్తాం

- ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు రోజారాణి


మాట్లాడుతున్న ఉపాధి ఏపీడీ రోజారాణి

నాతవరం: జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల కింద రూ.295 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేశామని సంబంధిత అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు ఎం.రోజారాణి తెలిపారు. శనివారం నాతవరంలో ఉపాధి సామాజిక తనిఖీ ప్రజా వేదికకు ఆమె విచ్చేసిన సందర్భంగా మాట్లాడారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కోటి పది లక్షల ఉపాధి పని దినాలు లక్ష్యంగా పెట్టుకోగా, ప్రస్తుతం కోటి పని దినాలు కల్పించామన్నారు. మార్చి నెలాఖరుకు లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. వచ్చే 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలోని 24 మండలాల్లో రెండు కోట్ల పని దినాలు కల్పించేందుకు ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పిస్తామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 767 మంది రైతులకు సంబంధించి 900 ఎకరాల్లో వివిధ జాతుల పండ్ల తోటలు పెంచామన్నారు. వీటి పెంపకానికి మూడేళ్ల పాటు ఉపాధి హామీ నిధులు ఇస్తుందన్నారు. తర్వాత చెరువు గట్లు, ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు భూముల్లో 81,906 మొక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారి నిర్మలాకుమారి, ఎంపీడీవో జాగరపు రాంబాబు, డీఆర్పీ బి.సూర్యనారాయణ, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా


వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న గవరపేట వేంకటేశ్వరస్వామి

కశింకోట : స్థానిక గవరపేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అందంగా పూలమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివాలయానికి ముస్తాబు



రంగులు వేస్తున్న కూలీలు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత తిరపురాంతక స్వామి ఆలయం (శివాలయం)కు రంగులు వేసే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. వచ్చే మార్చి 8న మహా శివరాత్రి దృష్ట్యా దాతల విరాళంతో ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేయడానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు.

రహదారి పనులు ప్రారంభించాలని వినతి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి : పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పెరుగుబజారు, రైల్వేస్టేషన్ రహదారి పనులను తక్షణమే ప్రారంభించాలని సిద్దార్థ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం ఉదయం పెరుగుబజారు కూడలి వద్ద ప్లకార్డులతో నిసరసన తెలియజేసి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. ఏఈ కె.రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సభ్యులు బూడిద జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 6,552 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	4,740
మొదటి రకం	3,600	4,330
రెండో రకం	3,860	3,860
మూడోరకం	3,220	3,450

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
సుందరం మాస్టర్:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం :	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థరాయ్	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన :	పర్తిసాయి
వూదో తిరిగి వచ్చింది:	వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–18 యూనిట్లు, బీ పాజిటివ్–28 యూనిట్లు, ఓ పాజిటివ్–14 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 372 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 347 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నవరత్నాలతో నవ్యమైన భరోసా



నాపేరు పెనగంటి దుర్గా అప్పారావు. మండలంలో చింతనిప్పల అగ్రహారంలో ఉంటున్నాం. నాకు భార్య సుబ్బలక్ష్మి, కొడుకు, కోడలు ఉన్నారు. మాకు ఒక ఎకరం 50 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం చేస్తు వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయాం. పంట చేతికి రాకుండానే వరుసగా మూడేళ్లు అప్పుల పాలయ్యాం. చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడ్డాం. అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి ఏడాదికి రూ.13,500 అందిస్తోంది. దీంతో పెట్టుబడి సాయంగా నగదు పనికొచ్చింది. తర్వాత సబ్సిడీ విత్తనాలు, ఎరువులు మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్నారు. నా భార్యకు వైఎస్సార్ చేయూత, స్త్రీ నిధి, బ్యాంకు రుణం, ఆసరా పథకాలు రావడంతో మా ఇద్దరం కలిసి గ్రామంలో టిఫిన్ దుకాణం పెట్టుకున్నాం. రోజుకు రెండు వేల వరకు వ్యాపారం చేస్తున్నాం. గతంలో ఉన్న అప్పులు తీర్చేసాం. ప్రతి నెల మా ఖర్చులు పోను కొంత నగదు దాచుకుంటున్నాం. వృద్ధాప్యం మీద పడుతున్నా కూడా ఒకరి దగ్గర చేయి చాచకుండా జీవిస్తున్నాం. సీఎం జగన్ మాలాంటి కుటుంబాలకు చాలా చేశారు. ఇంకా చేస్తారనే నమ్మకం ఉంది. మళ్లీ జగనే సీఎం అవుతారు.



టిఫిన్ షాప్ నిర్వహిస్తున్న పెనగంటి దుర్గాఅప్పారావు, సుబ్బలక్ష్మి



పాన్‌షాప్ నిర్వహిస్తున్న ధరణి



పేద కుటుంబాల బతుకులకు జగనన్న తోడ్పాటు

సొంత కాళ్లపై నిలబడ్డామని హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తుమ్మపాల : పేదల పక్షాన నేనున్నానంటూ భరోసాగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డి 2019లో సీఎంగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి చెప్పింది చేస్తూ పేదల బతుకుల్లో వెలుగులు నింపారు. ఆయన రూపొందించిన నవరత్నాలు పేదల జీవితాలను మెరుగుపరిచాయి. వ్యవసాయంతో నష్టాల పాలైన రైతులకు కూలిపనులే దిక్కయ్యాయి. వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక అన్నదాతలు పడిన ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉండేవి. వారి బాధలు పట్టించుకునే నాథులే లేక నానా ఇబ్బందులు పడేవారు. ఆ సమయంలో జగన్నాథుడిలా జగన్ వారి బతుకుల్లో వెలుగులు నింపుతూ అనేక సంక్షేమ పథకాలు అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూలీనాలీ చేసి పొందిన సొమ్ము వడ్డీ వ్యాపారులకే సరిపోయేది కాదు. తెల్లరితే చాలు ఇంటి ముందు వడ్డీ వ్యాపారులు ఉండేవారు. ఒకటా రెండా అనేక బాధల నుంచి నిలదొక్కుకుని నేడు తలెత్తుకుని తిరిగేలా రైతుల జీవితాలు మారేందుకు కారణం సీఎం జగన్.

పథకాలే మాకు దారి చూపాయి..

నవరత్నాలు మా ఇంట వెలుగులు నింపాయి. నెలకు రూ. 1000 ఉండే మా అత్త పింఛను నాలుగేళ్లుగా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెరిగింది. ఏడాదికి వైఎస్సార్ చేయూత పథకం రూ.18,750 చొప్పున మొత్తం 56 వేలు, వైఎస్సార్ ఆసరా రూ.7 వేలు చొప్పున రూ.28 వేలు, రైతు భరోసా రూ.13,500 చొప్పున రూ.54 వేలు, వాహనమిత్ర రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు నాలుగేళ్లుగా వస్తున్నాయి. స్త్రీనిధి రూ.30 వేలు, బ్యాంకు రుణం రూ.1 లక్ష రావడంతో గ్రామంలోనే పాన్‌షాప్, టిఫిన్ దుకాణం నిర్వహిస్తున్నాం.

– పెనగంటి ధరణి

ఆటో, పాన్‌షాప్‌తో సంతోషంగా జీవిస్తున్నాం..



నా పేరు పెనగంటి బలరాం. నా భార్యతో కలిసి పాన్‌షాప్ నిర్వహిస్తున్నాను. మా గ్రామంలో సచివాలయం, హైస్కూల్, ప్రాథమిక పశు ఆరోగ్య కేంద్రం, గ్రామీణ పీఏసీఎస్ బ్యాంక్, పాలకేంద్రం ఒకే దగ్గర ఉండటంతో అక్కడే మేము పాన్‌షాప్ పెట్టుకున్నాం. నేను ఆటో సర్వీస్ చేయగా నా భార్య షాప్ చూసుకుంటుంది. నాకు ఏడాదికి రూ.10 వేల వాహనమిత్ర ఇస్తున్నారు. ఈ ఏడాదే షాపు పెట్టడం వల్ల జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేశాం. నా భార్య ధరణికి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. – పెనగంటి బలరాం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



స్థానిక గవరపేటలో రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద



ఉచితంగా మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట : స్థానిక గవరపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 175 మందికి వైద్య సేవలందించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశోద శిబిరంలో రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఎక్కువగా కాళ్ల నొప్పులు, ఒంటి నొప్పులతో రోగులు హాజరయ్యారు. అలాగే బీపీ, షుగర్ వ్యాధులకు కూడా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కాన్సెప్ట్ క్లినిక్ ఎంఎల్‌పీహెచ్ దుర్గ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం దరఖాస్తు చేయండి

జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూరి అప్పారావు

రావికమతం: మండలంలో 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులంతా పింఛన్ కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు తెలిపారు. శనివారం రావికమతంలో మండల చేనేత సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో అర్హులైన చేనేత కార్మికులందరికీ పింఛన్ వచ్చేలా చూడాలని మండల చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి దొడ్డి సురేష్, పప్పు వెంకటరమణ తదితరులు ఆయన దృష్టికి తీసుకురాగా, పైవిధంగా స్పందించారు. దీంతోపాటు చేనేత కార్మికుల సమస్యలను కార్పొరేషన్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

వైభవంగా కేశవస్వామివారి నాగవల్లి వసంతోత్సవం



కేశవస్వామివారి నాగవల్లి వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న భక్తులు

చోడవరం: కేశవస్వామివారి కల్యాణోత్సవాల్లో స్వామివారికి నాగవల్లి వసంతోత్సవం కన్నుల పండువగా శనివారం జరిగింది. చోడవరంలో శ్రీదేవి భూదేవి సమేతుడైన కేశవస్వామివారి 751వ వార్షిక బ్రహోత్సవాలు ఐదు రోజులుగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణంలో భాగంగా నాగవల్లి వసంతోత్సవంలో శ్రీచక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి కేశవస్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచి వసంతోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, మహా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం అన్నమాచార్య పురందరదాస సంకీర్తనాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి, ట్రస్టు బోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, మాజీ చైర్మన్ ఉప్పలబాబు పాల్గొన్నారు.

వేడుకగా గిరి ప్రదక్షిణ

తాండవ నల్లకొండమ్మ తల్లి ప్రాంగణంలో భక్తుల కోలాహలం



తాండవ నల్లకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నాతవరం: తాండవ ప్రాజెక్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ప్రాంగణంలో శనివారం గిరి ప్రదక్షిణలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రాంతీయులు ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలగా పూర్తవుతుందన్న అపార నమ్మకం. దీంతో కొంత కాలంగా ఏటా ఫిబ్రవరిలో గిరిప్రదక్షిణ చేస్తుంటారు. ఈ ఏడాదీ మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శనివారం ఉదయం 9 గంటల నుంచి తాండవ, ఆడాకులు, తాండవ ప్రాజెక్టు స్పిల్ వే గేట్లు, జాలారిపేట గ్రామం మీదుగా గిరి ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళల కోలాటం, భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరి ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి : మండలంలోని శారదానగర్‌లో వినాయక ఆలయ 41వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయంలో స్వామివారికి గరికపూజ, పంచామృతాభిషేకం బాలగణపతి సేవా సంఘం సభ్యులు నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కరణం ఆనంద్, కరణం సాంబశివరావు, కరణం మోహన్‌రాజు, కరణం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతోనే ఉన్నత శిఖరాలకు..



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

అనకాపల్లి : విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ హరిబాబు అన్నారు. గవరపాలెం దాసరిగెడ్డ రహదారిలో డాక్టర్ హిమశేఖర్ స్కూల్లో శనివారం వార్షికోత్సవ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఉషానందిని, ఉపాధ్యాయులు గోపీకృష్ణ, జగన్, నాగశివ, పూర్ణ, శేషు, శ్రీదేవి, శిరీష, నాగలక్ష్మి పాల్గొన్నారు.

విశ్లేషణతో మెరుగైన అవగాహన



ప్రదర్శనను తిలకిస్తున్న జడ్జి గంగరాజు

అనకాపల్లి : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు హాజరయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పనిని ఇతరులతో పంచుకోవడం ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. శోధన, ప్రయోగాలు, ఆకృతీకరణ, విశ్లేషణ ద్వారా మరింతగా విజ్ఞానశాస్త్రంలో మెలకువలు అవగతం అవుతాయన్నారు. నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.మణి, నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జి ఎస్. వెంకటేష్, ప్రిన్సిపాల్ జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

ఉమామహేశ్వరీ దేవి తీర్థ మహోత్సవానికి సర్వం సిద్ధం

దేవరాపల్లి: గ్రామస్తుల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరీ దేవి తీర్థ, కల్యాణ మహోత్సవాలు ఆఖరి రోజు ఆదివారం దేవరాపల్లిలో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమైన తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేస్తున్నారు. ఆలయానికి వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు ఎంపీపీ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి పలు వీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్

గొలుగొండ: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేసేలా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ కోరారు.

మాడుగుల రూరల్: పల్స్ పోలియో విజయవంతం చేయాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్. పుష్పమ్మ తెలిపారు. శనివారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో ఆమె సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలోని 26 బూత్‌ల్లో 2,515 మంది ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు ముందు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీరికి 150 పోలియో వైల్స్ అవసరముందని, ముగ్గురు రూట్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. 104 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఆ రోజు చుక్కల మందు వేసుకోలేని వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తారన్నారు.

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

రోలుగుంట: స్థానిక సిద్ధి వినాయక స్వామి వారి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది స్వామివారిని పూల దండలతో అలంకరించారు. ఎంతో విశిష్టత కలిగిని స్వామి వారిని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులతోపాటు భోగాపురం, కొవ్వూరు, కొండపాలెం, కొత్తకోట తదితర గ్రామాల భక్తులు అధికంగా తరలి వచ్చి దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



దుర్గాలమ్మ అమ్మవారు



నీలకంఠాపురంలో నిర్మించిన అమ్మవారి ఆలయం

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులతో పాటు పలువురి దాతల విరాళాలతో గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో కొత్తగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా ప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, పలువురు నాయకులు హాజరు కానున్నారని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సర్పంచ్ పడాల నాగభూషణం, వైస్ సర్పంచ్ పడాల వెంకటరమణ గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

ఆరు తడి పంటలతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథరావు

అనకాపల్లి : ఆరు తడి పంటల ద్వారా ఉత్పత్తితో పాటు అధిక ఆదాయం సమకూర్చుకోవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. శనివారం జరిగిన వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినుము, పెసర, నువ్వులు, జనుము, మొక్కజొన్న వంటి పంటలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఖరీఫ్ కాలంలో సరైన వర్షపాతం నమోదు కాని కారణంగా రబీ పంటల విస్తీర్ణంపై ప్రభావం చూపిందని, ఆశించిన దిగుబడులు రాలేదన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ తమ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వైఎల్ఎం-66 రకాన్ని ఉపయోగించి సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని సూచించారు. జిల్లాలో రైతాంగ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సబ్ డివిజన్ల ఏడీఏలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పీహెచ్ ప్రభాకరరావు, ఎం.విశాలాక్ష్మి, ఎస్.రామలక్ష్మి, కేవీ రమణమూర్తి, డి.ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

అనకాపల్లి : స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు వై.వీ.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, గృహసారథులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరు కావాలన్నారు.

చురుగ్గా సిమెంట్ రోడ్డు నిర్మాణం

కశింకోట : కశింకోటలోని ఉప్పు నీటి దిబ్బ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పని చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన రూ.50 లక్షల నిధులతోరోడ్డు నిర్మాణం చేపట్టి నిర్వహిస్తున్నారు. అలాగే రౌతువీధి, అమరపల్లివీధి ప్రాంతాల్లో రహదారులను కూడా త్వరితగతిన నిర్మించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

కులం పేరుతో దూషించిన నలుగురిపై కేసు నమోదు

అనకాపల్లి : కులం పేరుతో దూషించిన నాలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. ఈనెల 22న స్థానిక విజయరామరాజుపేటలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఉత్సవంలో అదే గ్రామానికి చెందిన లచ్చుతో పాటు మరో ముగ్గురు స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తున్నారు. వడ్డాది దుర్గాప్రసాద్ ఎందుకు డ్యాన్స్ చేస్తున్నారని వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందని డీఎస్పీ చెప్పారు. దుర్గాప్రసాద్‌ను లచ్చుతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.